సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



'గ్రీన్ అంబాసిడర్ల' ఆకలి కేకలు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. - 8లో



పెండింగ్ కేసులు పరిష్కరించండి

వృత్తి నైపుణ్యత, సాంకేతిక ఆధారంగా పెండింగ్ కేసులను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశించారు. - 8లో



ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల మండలంలో గత కొన్ని రోజులుగా ఏనుగులు పంటలపై దాడులు చేస్తూ అన్నదాతలకు నష్టం కలిగిస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుల నియామకం

- తిరుపతి ఎంపీ గురుమూర్తి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎంపిక
- పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో ఏర్పాటు


ఎంపీ గురుమూర్తి


చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ (ప్రత్యేక బృందాలు) నియామకంలో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు గురవుతున్న సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ తరపున ఈ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం కల్పించడంతో పాటు, వారికి మేమున్నాం అన్న భరోసా ఇవ్వడం, వారిని పరామర్శిస్తూ ఆత్మస్థైర్యాన్ని పెంచడం కోసం పార్టీ కొత్తగా ఏర్పాటైన ప్రత్యేక బృందాలు పనిచేస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాల వారీగా పార్టీ ముఖ్య నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పార్టీ ప్రత్యేక బృందాలు పని చేస్తాయని స్పష్టం చేశారు.

లగ్న జనన ఆస్పత్రులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): లగ్నం, తిథి చూసి ప్రసవాలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. బుధవారం సాక్షి దినపత్రికలో లగ్న జననం అనే పేరిట వార్త ప్రచురితమైంది. దీనికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏప్రిల్ 24 నుంచి అక్టోబర్ నెల వరకు 2002 సిజేరియన్లు జరిగినట్లు గుర్తించారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుని లగ్న జననాలు చేస్తున్నారని గుర్తించారు. ఈ ఏడాది కాలంలో సిజేరియన్లు చేసిన ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ కారణాలను నివేదిక రూపంలో ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి సంవత్సరం సీ–సెక్షన్ ఆడిట్‌ను విధిగా నిర్వహిస్తామని.. ఇకపై ముహూర్తం పేరిటతో ప్రసవాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. లగ్న జననాలు తల్లీబిడ్డకు అంత మంచిది కాదని డీఎంఅండ్‌హెచ్ ప్రభా వతి దేవి ప్రకటనలో పేర్కొన్నారు.

కృష్ణమ్మ రాక గగనమే!

కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో హంద్రీనీవా ప్రాజెక్టు కోసం అరకొర నిధులు కేటాయింపులు చేశారు. ఈ కేటాయింపులను చూస్తుంటే కుప్పానికి కృష్ణా జలాలు ఇప్పట్లో కష్టమేననే మాట వినిపిస్తోంది. 2006లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించడం వల్లనే ఈమాత్రం పనులు పూర్తయ్యాయి. ఆపై టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ బడ్జెట్‌లలో హంద్రీనీవాకు నిధులు అరకొరగానే కేటాయిస్తూ వచ్చారు. ఈసారి బడ్జెట్‌లో కూడా కేవలం రూ.867 కోట్లు కేటాయించడంతో గతంలో ఇక్కడ పనులు చేసిన కంపెనీకి బకాయిలకు చెల్లిస్తారా ? చెల్లిస్తే పనులు ఎలా సాగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

పుంగనూరు నుంచి ప్రారంభమయ్యే కుప్పం ఉపకాలువ



- ఇప్పట్లో కుప్పానికి కృష్ణా జలాలు రావడం కష్టమే !
- బడ్జెట్‌లో కేవలం రూ.867 కోట్లు నిధుల కేటాయింపు
- ఇందుతో పాత బిల్లులు చెల్లిస్తారా ? లేక కొత్తపనులు చేస్తారా !
- పీబీకే బకాయిలే రూ.117 కోట్లు
- మళ్లీ ఇప్పుడు పీబీసీ లైనింగ్ కోసం రూ.470 కోట్లు అవసరం
- వచ్చే ఏడాది మార్చిలోపు రూ.400 కోట్లు ఖర్చు చేస్తారా?
- టీడీపీ పాలనలో ప్రతిసారీ బడ్జెట్‌లలో హంద్రీనీవాకు అరకొర నిధులే కేటాయింపు
- ఈసారి కూడా అదే తంతు
- ఇలా అయితే ప్రాజెక్టు పూర్తయ్యేదెన్నడో..!

పలమనేరు: పలమనేరు, కుప్పం ప్రాంతాలు మెట్టభూములు ఎక్కువ. ఇక్కడ నదులు లేక పంటలకు వర్షాధారమే దిక్కు. ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో కుప్పానికి కుప్పంఉపకాలువ ద్వారా నీరు చేరింది. కృష్ణాజలాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీటీఎం నుంచి పుంగనూరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి దాకా పుంగనూరు ఉపకాలువ ద్వారా సాగుతుంది. అక్కడి నుంచి గంగవరం, బైరెడ్డిపల్లి, వీకోట, రామకుప్పం మీదుగా కుప్పం మండలంలోని పరమసముద్రం దాకా సాగుతుంది. కుప్పం సబ్‌కెనాల్‌కు సంబంధించి 2015లో టెండర్లు నిర్వహించగా రూ.430 కోట్లతో హెచ్‌ఈఎస్–ఆరేకే–కోయా కంపెనీలు పనులు దక్కించుకున్నాయి. 2016లోపు ఈ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సదరు కంపెనీలు పనులు చేస్తుండగానే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ కంపెనీలతో పాటు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీకి సైతం భాగస్వామ్యం కల్పించింది. ఆ కంపెనీకి మేలు జరగాలని ఈ పనుల కోసం అదనంగా రూ.144 కోట్లను కేటాయించారు. దీంతో ఈ పనుల విలువ రూ.575 కోట్లకు చేరింది. ఈ కంపెనీలన్నీ కలసి 80 శాతం పనులు పూర్తి చేసి 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ రాకతో పనులను ఆపేశారు. గత ప్రభుత్వం ఈ కంపెనీలకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా చలనం లేకుండా పోయింది. 2022లో కుప్పం పర్యటకు వెళ్లిన నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం కాలువ పనుల్లో ఆగిన 20 శాతం పనులను చేపట్టాల్సి రావడంతో గత ప్రభుత్వం పెండింగ్ కాలువ నిర్మాణాలు, స్ట్రక్చర్ నిర్మాణాలు, 8 వేల క్యూబిక్ మీటర్లు మట్టి పనులు, 40 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, మూడు చోట్ల లిఫ్ట్ పనులను రూ.117 కోట్లకు ఈ పనులను చేపట్టారు. దీంతో ఈ కంపెనీ ద్వారా 40 శాతం పనులు చకచకా పూర్తి చేసి గత ఎన్నికలకు ముందు కుప్పానికి కృష్ణానీటిని అందించింది. ఇందుకోసం ఆర్‌ఆర్ కంపెనీ రూ.40 కోట్ల పనులు చేయగా మరో రూ.77 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.


పీబీకే బకాయిలే రూ.117 కోట్ల దాకా..!

పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి గతంలో చేపట్టిన పనుల బకాయిలు రూ.117 కోట్ల వరకు ఉన్నాయి. ఇప్పుడు కేటాయించిన నిధుల్లో పెండింగ్ బకాయిలకు చెల్లిస్తే ప్రతిపాదించిన కాలువ పనులు ఎలా ముందుకు సాగుతాయనే అనుమానం వస్తోంది. దీన్ని బట్టి చూస్తే పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు లేనట్టుగా తెలుస్తోంది. పీబీసీ కాలువకు ఉన్న కెపాసిటీ 380 క్యూసెక్కులుగా ఉంది. అదే విస్తరణ పనులు పూర్తయి ఉంటే దీని ప్రవాహ సామర్థ్యం 1,180 క్యూసెక్కులకు చేరేది. ఫలితంగా ఎక్కువగా కృష్ణా జలాలు ఈ ప్రాంతానికి వచ్చేవి. ఈ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి, పుంగనూరు, మదనపల్లె, పీలేరు, కుప్పం నియోజకవర్గాలకు సాగునీటి సమస్య తీరేది. మరోవైపు అడవిపల్లి, శ్రీనివాసపురం రిజర్వాయర్ల నుంచి చిత్తూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయానికి నీరందేవి. ఫలితంగా చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు మేలు జరిగేది.


కుప్పం ఉపకాలువ మ్యాప్

రూ.867 కోట్లతో పనులు ఎలాగంటే..!

ఈ నిధులను ప్రాజెక్టు ఫేజ్–2కు వినియోగించుకోవాల్సి ఉంది. ఆ మేరకు పుంగనూరు ఉపకాలువ లైనింగ్ కోసం రూ.473 కోట్లకు పైగా, అనంతపురం జిల్లాలో కాలువ పనులకు రూ.139 కోట్లు, రిజర్వాయర్లకు రూ.200 కోట్లు దాకా ఖర్చు చేయనున్నారు. అయితే ఇందులో పెండింగ్ పనుల ఊసే లేకుండా పోయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనులు పూర్తి కావాలంటే ఇందులోని ఉపకాలువలు, 12 చోట్ల స్ట్రక్చర్లు తదితర పనులను చేపట్టాల్సి ఉంది.




ప్రస్తుతం కుప్పం బ్రాంచ్ కెనాల్ పరిస్థితి

ఉప కాలువ లక్ష్యం ఇదీ!

హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలైన(కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు)ల్లోని 6,025 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షలమంది ప్రజలకు మంచినీటిని అందించడమే దీని లక్ష్యం. ఇందుకోసం కృష్ణా నది నుంచి 120 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలించే పథకం ఇది. ఇందులో భాగమే కుప్పం, పుంగనూరు ఉప కాలువలు. పుంగనూరు ఉపకాలువ నుంచి 143.9 కిలోమీటర్ల మేర కుప్పం ఉపకాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాలకు 4.02 లక్షల మందికి తాగునీరు, 110 చెరువులకు ఈ నీటిని మళ్లించడంతో ఇక్కడి చెరువుల పరిధిలోని 6,300 ఎకరాల భూములకు సాగునీటిని అందించాలన్నది లక్ష్యం. పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె నుంచి ఈ పనులు 143.9 కి.మీ. పొడవుతో కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువులో కలవాలి. ఇందులో భాగంగా గంగవరం మండలంలోని పశపత్తూరు, వీకోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్‌హౌస్‌లను ఈ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో పశపత్తూరు వద్ద 750 కిలోవాట్స్ సామర్థ్యంగల నాలుగు మోటార్లు ఏర్పాటు చేసి, వచ్చిన నీటిని హంద్రీనీవా పైప్రాంతంలోని కాలువకు పంపింగ్ చేశారు. ఇందుకోసం గంటకు 5400 క్యూసెక్ మీటర్ల నీటిని పంపే 5వేల కేవీ మోటార్లను అమర్చారు. దీంతో పాటు నీరు వేగంగా వెళ్లేలా భారీ కంప్రెసర్లు, అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పూర్తిస్థాయిలో ఈ పనులు జరిగి ఈ ప్రాంతానికి కృష్ణమ్మ రాక దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది.


నేతిగుట్టపల్లి, ఈడిగపల్లి వద్ద పుంగనూరు కాలువ

ఆర్నెళ్లుగా నిర్వీర్యం


కుప్పంలోని గోనుగూరు పంచాయతీలో రోడ్డు దుస్థితి

- "ఇది సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం పరిస్థితి. గోనుగూరు పంచాయతీలో సైకిల్‌పై వెళ్లడానికి రోడ్డు అంతంత మాత్రంగా ఉంది. జలజీవన్ పథకం కింద కొత్త రోడ్డు వేస్తామని, ఉన్న రోడ్డును తవ్వేశారు. తవ్వడానికి ఉన్న నిధులు, రోడ్డు వేయడానికి చాల్లేదు. ఇంకేముంది..? ఇదిగో ఇలా రోడ్డును తవ్వేయడంతో మూడు నెలలుగా ఇలా ఉండిపోయింది."

- స్థానిక సంస్థల గురించి పట్టించుకోని కూటమి సర్కారు
- నిధుల్లేక కనీస వసతుల కల్పించలేని దుస్థితిలో పాలకులు
- ఆర్నెళ్లవుతున్నా పైసా విదల్చని పాలకులు
- మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను పైనే ఆధారపడిన వైనం
- అత్యవసర పనుల కోసం గ్రామాల్లో ఎదురు చూపులు
- ఆర్థిక సంఘ నిధులతో నెట్టుకొస్తున్న స్థానిక సంస్థలు

- "ఐరాల మండలం నాగంవాండ్లపల్లె పంచాయతీలోని మొరవా వడ్డిపల్లెలో రోడ్డు పరిస్థితి ఇది. చిన్నపాటి వర్షం పడితే రోడ్డు ఇలా తయారవుతుంది. కాలు తీసి కాలు వేయలేని దుస్థితి. ఇక ఊరి మధ్యలో వంక ప్రవహిస్తుండడంతో మరోదారి కూడా లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామంలోని ప్రజలంతా ఈ బురదలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కొత్త రోడ్డు వేయాలంటే నిధుల్లేవని అధికారులు నిట్టూరుస్తున్నారు."


దుస్థితిలో ఐరాల మండలం వడ్డిపల్లె రోడ్డు

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లవుతున్నా.. రాజకీయ కక్షలు, దాడులపైనే శ్రద్ధ చూపిస్తోంది తప్పా సంక్షేమంపై కాదు. ప్రజా సమస్యలను తీర్చడంలో అలసత్వం చూపిస్తోంది. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి సోషల్ మీడియా కేసులను తెరపైకి తీసుకొచ్చి కాలం నెట్టుకొస్తోంది. అటు గ్రామీణ ప్రాంతాల్లో, ఇటు పట్టణాల్లో ప్రజలకు మౌలిక వసతులు, సదుపాయాల కల్పనపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా నిధుల్లేక స్థానిక సంస్థలు నిర్వీర్యమవుతున్నాయి.

గ్రామాల్లో ఇలా..

జిల్లాలో 697 పంచాయతీలు ఉంటే, 14.36 లక్షల మంది జనాభా ఉన్నారు. ఇందులో 13 పంచాయతీలు పలు రకాల సమస్యలతో ఎన్నికలకు దూరంగా ఉంటే, మిగిలిన 684 గ్రామాల్లో పాలకవర్గాలు ఉన్నాయి. మరో ఏడాది కాలంలో సర్పంచ్‌ల పదవీకాలం కాస్త పూర్తి కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లవుతోంది. కానీ స్థానిక సంస్థలపై ఏమాత్రం దృష్టి సారించలేదు. గ్రామాల్లో చిన్నచిన్న పనులు చేయలేక సర్పంచ్‌లు మొహం చూపించలేని పరిస్థితి నెలకొంది. ప్రజల అవసరాలు సమస్యలుగా మిగిలిపోతున్నాయి. రోడ్లు, కాలువలు, వీధి దీపాల నిర్వహణ కూడా పంచాయతీలకు భారంగా మారిపోతోంది. గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధులతో పాటు ప్రత్యేక గ్రాంట్లు ఇస్తుండడంతో అభివృద్ధి పనులకు ఎక్కడా లోటురాలేదు. మౌలిక వసతుల కల్పన, సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఇళ్ల నిర్మాణం లాంటివి కార్యరూపం దాల్చి.. సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. కానీ కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి ఇంకా రూపాయి కూడా ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో నిల్వ ఉన్న ఆర్థిక సంఘ నిధుల్లోని రూ.29 కోట్ల వరకు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులు కూడా అధికార పార్టీ నాయకులకు అప్పగిస్తూ, నామినేటెడ్ కింద పనులు చేయడానికి చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయి. ఇక పల్లెపండుగ పేరిట నిర్వహించిన గ్రామ సభల్లో జిల్లాలో 1,427 పనులు చేయాలని గుర్తించారు. ప్రజల కనీస అవసరాలను తీర్చడానికి నిర్వహించిన గ్రామసభల్లో పనులు చేయడానికి రూ.91.30 కోట్లు అవసరం అవుతుందని యంత్రాంగం ప్రాథమికంగా నిర్ధారించింది. మరి ఈ నిధులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియడంలేదు.

మున్సిపాలిటీల్లో మరీ దారుణం..

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలను పట్టించుకోవడమే మానేసింది. జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆర్నెళ్ల కాలంలో ప్రత్యేక గ్రాంట్, ఆర్థిక సంఘ నిధులు గానీ మున్సిపాలిటీలకు జమ కాలేదు. ప్రజారోగ్యం కాపాడడానికి పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఆయా స్థానిక సంస్థల్లో సాధారణ పద్దుల్లో ఉన్న నిధులను ఉపయోగిస్తున్నారు. అవి కూడా ఆస్తి పన్ను రూపంలో ప్రజల నుంచి వసూలైన నిధులే. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కుదురుకున్న మూడు నెలలకే స్టేట్ స్పెషల్ గ్రాంట్స్, ఆర్థిక సంఘ నిధులాంటి వాటిని విడుదల చేయాలి. కానీ ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. చిత్తూరు కార్పొరేషన్ కాస్త ఆర్థిక పరిపుష్టిగా ఉండడంతో సాధారణ పద్దులతో పాటు ఆర్థిక సంఘ నిధుల నుంచి పనులు చేయడానికి ఇటీవల టెండర్లు పిలిచింది. మిగిలిన మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు వర్కర్లకు జీతాలు చెల్లించడానికి కూడా నిధులు చాలడంలేదు.

జనాలకు ఇబ్బంది ఉండాది..



"మా పంచాయతీలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలి. కొన్నిచోట్ల రోడ్లు, మరి కొన్ని చోట్ల కాలువలు వేయాల్సి ఉండాది. ఇవి లేకపోవడం వల్ల మురుగునీళ్లు, వర్షపు నీళ్లు ఎక్కడికక్కడే ఆగిపోతాండాయి. జనాలకు జ్వరాలు వస్తా ఉండాయి. పనులు చేయాలని పంచాయతీ ఆఫీస్‌లో అడిగితే ఇంకా దుడ్డు రాలేదంటా ఉండారు. దుడ్డు వచ్చిందే పనులు చేస్తే బాగుంటాది.
– రామ్మూర్తి, సర్పంచ్, కుప్పిగానిపల్లె, గుడుపల్లె మండలం, కుప్పం

డబ్బు లేదంటున్నారు..



మా పంచాయతీ విషయం పక్కన పెడితే.. మండల కేంద్రానికి రోజూ ఏదో ఒక పనిమీద వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో మరుగుదొడ్లకు వెళ్లాలంటే సౌకర్యం లేదు. మహిళల పరిస్థితి మరీ దారుణం. ఆఫీసుల్లో మరుగుదొడ్లను అధికారులు, సిబ్బంది వాడి, మళ్లీ తాళాలు వేసుకుని వెళ్తారు. మండల కేంద్రంలో టాయ్‌లెట్ కట్టమని చెబుతేంటే డబ్బులేదంటా ఉండారు. – రజనీకాంత్, సర్పంచ్, వసంతాపురం, గుడిపాల

సెక్షన్ల వారీగా ట్రాన్స్‌ఫార్మర్ పెట్టండి


మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి సెక్షన్‌లో ఒక ట్రాన్స్‌ఫార్మర్ అదనంగా పెట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డివిజన్ల పరిధిలో మార్పులు జరగాయని, కొత్తగా రూరల్ డివిజన్‌లో కార్వేటినగరం, జీడీనెల్లూరు, నగరి సబ్‌డివిజన్లు వచ్చాయన్నారు. అందుకే అందరితో కలిసి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెక్షన్ పరిధిలో లైన్ ఇన్‌స్పెక్టర్ అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేయాలని, గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈఈ సురేష్, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

20న ఫ్రీజర్లు, బ్యాటరీల వేలం

చిత్తూరు అర్బన్: గతంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉపయోగించిన ఫ్రీజర్లు (88 యూనిట్లు), బ్యాటరీ ఇన్వర్టర్లు (86), నగదు లెక్కించే యంత్రాలు (85), గల్లాపెట్టెలు (88), స్కానర్లు (112)ను వేలం వేయనున్నట్లు చిత్తూరు మద్యం డిపో మేనేజరు పార్థసారథి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన ఉదయం 10.30 గంటలకు పూతలపట్టులోని వడ్డేపల్లె ఎక్సైజ్ డిపో ఆవరణలో ఈ యూనిట్లను వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వాళ్లు కార్యాలయ పని వేళల్లో వస్తువులను చూసుకోవచ్చని, రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9177887729, 7780566131, 9949351040 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

27 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి రూ.2.70 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి గురువారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 27 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.70 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల(కల్లూరు): చీకటి పడగానే ఏనుగులు పంటపొలాలపై పడుతున్నాయి.ప వరుసగా పంటలను నష్టం చేస్తుండడంతో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లుతోంది. తాజాగా పులిచెర్ల మండలంలోని వెంకట దాసరపల్లె పంచాయతీ సువ్వారపువాండ్లపల్లెలో గురువారం తెల్లవారుజామున ఏనుగులు రైతు మురళీకి చెందిన టమాటా పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే సమీపంలోని వరి పంటను కూడా తొక్కేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత రాత్రి కూడా అదే గ్రామంలోని రైతుల పొలాల్లోని పంటలను తొక్కి నాశనం చేసిన విషయం విదితమే. నెల రోజులుగా ఏనుగులు మండలంలోనే తిష్ట వేసి పంటలను నాశనం చేస్తున్నాయి.

చిత్తూరుకు నీటి కేటాయింపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు 0.785 టీఎంసీల తాగునీటిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీఓ 395ను విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు నగరానికి 0.785 టీఎంసీల తాగునీటిని అందజేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కాగా రెండు రోజుల కిందట చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఇదే అంశంపై అసెంబ్లీలో సైతం చర్చించారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో అదృశ్యమైన మైనర్ బాలిక ఆచూకీని పోలీసులు కనిపెట్టారు. గురువారం బాలికను తీసుకొచ్చి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. గత ఆదివారం 14 ఏళ్ల మైనర్ బాలిక ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇటీవల బాలిక ఆచూకీ కనిపెట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సైతం పోలీసుశాఖను కోరారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకుని, ఆమెను సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా ఈ కేసులో బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డారని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిత్తూరు లోని గిరింపేటకు చెందిన డిల్లీ, దినేష్ అనే ఇద్దరు యువకులపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు.

పిడుగు పాటుకు ఆవు మృతి



మృతి చెందిన ఆవు

బంగారుపాళెం: మండలంలోని పులిమడుగు గ్రామంలో పిడుగు పడి పాడి ఆవు మృతి చెందింది. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. పొలానికి సమీపంలో పశువులు మేత మేస్తుండగా పిడుగు పతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు స్వామినాథన్ వాపోయాడు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పశువైద్యాధికారులతో మాట్లాడి పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆకలి కేకలు!



గ్రామాల్లో పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు



జెడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

- కుటుంబ పోషణ కష్టమై.. ఉద్యోగ భద్రత లేక..
- అలమటిస్తున్న హరిత రాయబారులు
- నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కూటమి ప్రభుత్వం
- చిత్తూరు జెడ్పీ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన
- రూ.కోటికి పైగా వేతనాలివ్వాలని నిరసన

చిత్తూరు అర్బన్/చిత్తూరు కార్పొరేషన్ : గ్రీన్ అంబాసిడర్లు (హరిత రాయబారులు).. ఇది చెప్పడానికి పేరు గొప్పగా అనిపిస్తున్నా, వారి జీవితాల్లో ఆ గొప్పతనం కనిపించడం లేదు. ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. పల్లెల్లో ఇంటింటా చెత్త సేకరణ, దాని నుంచి వర్మీకంపోస్టు తయారీ కోసం నియమించిన గ్రీన్ అంబాసిడర్లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆర్నెళ్ల కాలంలో ఒక్క నెల కూడా వేతనం కూడా ఇవ్వలేదు.

అన్ని పనులు చేయిస్తూ..

చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని 1,411 పంచాయతీల్లో 2,697 మంది గ్రీన్‌అంబాసిడర్లను నియమిస్తూ 2017వ సంవత్సరంలో ఉత్తర్వులు జారీ చేశారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో చెత్తను సేకరించి, వాటి నుంచి వర్మీకంపోస్టు తయారు చేసే పనులు అప్పగించారు. ఇవికాకుండా గ్రామాల్లో కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయడంతో పాటు పంచాయతీ కార్యాలయాల్లో పనులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో చెత్త తీయడం లాంటి అన్ని పనులకు ఉపయోగించుకుంటున్నారు. ఇందుకుగాను ఒక్కో రాయబారికి నెలకు రూ.6 వేల గౌరవ వేతనాన్ని ఆర్థిక సంఘ నిధుల నుంచి చెల్లించాలని జీఓ విడుదల చేశారు. అయితే వారిపై పని ఒత్తిడి, రాజకీయ జోక్యం పెరగడంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 1,977 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 720 మంది విధులు వదులుకున్నారు.

వేతనాలు ఏవీ..?

చిత్తూరు, తిరుపతి, మదనపల్లె ప్రాంతాల్లోని వందలాది మంది కార్మికులకు వేతనాలు నిలిపేశారు. అంబాసిడర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న యంత్రాంగం, వేతనాలు అడిగితే మాత్రం నిధులు రాలేదని చెబుతున్నారు. ఫలితంగా గ్రీన్ అంబాసిడర్లకు దాదాపు రూ.కోటి వరకు వేతనాలు బకాయిలు పేరుకున్నాయి. ఇప్పటికే జిల్లాకు రూ.29 కోట్ల వరకు కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం జీఓ విడుదల చేసింది. పైగా కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని పంచాయతీల్లో ఇప్పుడు పనిచేస్తున్న వాళ్లను తొలగించి, తమ పార్టీ కోసం పనిచేసిన వారిని విధుల్లో పెట్టుకోవాలని కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. వేతనాలు రాక అల్లాడుతుంటే, ఇప్పుడు ఉద్యోగం ఉంటుందా..? ఊడుతుందా..? అని తెలియక అంబాసిడర్లు దిగాలు పడుతున్నారు.

ఇవీ డిమాండ్లు..

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం చిత్తూరు నగరంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నాకు దిగారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతపై హామీ ఇవ్వాలని, వేతనాలను రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దాము, ఏపీ పంచాయతీ అంబాసిడర్ల వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎవరూ పట్టించుకోట్లేదు..



ఊర్లు శుభ్రంగా ఉంచడానికి రోజూ కష్టపడతా ఉండాము. మాకు జీతాలు ఇచ్చే బాధ్యత గవర్నమెంటుపై ఉంది. నెలలుగా జీతాలు ఇవ్వలేదు. కుటుంబాన్ని ఎట్లా పోషించాలి..? మా కష్టం ఎవరూ పట్టించుకోట్లేదు. మాబతుకులతో దయసేసి ఆడుకోవద్దు. అధికారులు మా జీతాలు మాకిప్పించండి. – మాధవి, తిరుమల రాజపురం పంచాయతీ

ఇచ్చేయమని చెప్పాం..

గ్రీన్ అంబాసిడర్లకు ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు ఇవ్వాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు అందరికీ ఆదేశాలు ఇచ్చాం. ఈ విషయమై పలుమార్లు కార్యదర్శులతో మాట్లాడాం. వీలైనంత త్వరగా వేతనాలు కార్మికులకు అందేలా చర్యలు తీసుకుంటాం. – షణ్ముగం, జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర సమన్వయకర్త, చిత్తూరు

పవన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం..



నెలల తరబడి కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. కలెక్టర్, జెడ్పీ సీఈఓ, డీపీఓ, డీపీఆర్సీ డీసీ, పంచాయతీ కార్యాలయాల్లో ఇలా ప్రతీ ఒక్క అధికారికి వినతులు ఇచ్చినాఏ ఒక్కరూ స్పందించడం లేదు. ఈనెలాఖరులోపు వేతనాలు ఇవ్వకుంటే వచ్చేనెల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రీన్ అంబాసిడర్లతో కలిసి మా శాఖ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం. – శ్రీరాములు, రాష్ట్ర కార్యదర్శి ఏపీ గ్రామ పంచాయతీ అంబాసిడర్ల వర్కర్స్ యూనియన్

మా సత్తా చాటుతాం..



గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించకపోతే కార్మిక సంఘాలు అంతా కలిసి కదం తొక్కుతాం. రెక్కాడితే గానీ డొక్కాడని వారికి వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబ పోషణ ఎలా గడుస్తుంది ? పైగా ఉన్న వాళ్లను తీసేసి, మా పార్టీ వాళ్లను పెట్టుకుంటామని బెదిరింపులకు దిగుతున్నారు. ఇలాంటి రాజకీయ ఒత్తిళ్లను సహించేది లేదు. – నాగరాజన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ

అన్ని పనులు చేయిస్తున్నారు..



గ్రామాల్లో చెత్తసేకరణ, వర్మీకంపోస్టు తయారీతో పాటు మా చేత అన్ని పనులు చేయిస్తున్నారు. మీటింగుల్లో చెత్తను తీస్తున్నాం. ఓవర్ హెడ్ ట్యాంకులు మేమే కడుగుతున్నాం. బోరు రిపేరైనా, పైప్‌లైన్ లీకేజీలున్నా అన్నింటికీ మమ్మల్నే పిలుస్తున్నారు. చెప్పిందల్లా చేస్తున్నా జీతాలు ఇవ్వకుంటే ఎట్లా బతకాలి..? – అన్నాదొరై, కార్మికుడు నెలవాయి పంచాయతీ

పొలంలో పనిచేస్తుండగా..

- వృద్ధురాలి మెడలోని గిల్ట్ చైను, బంగారు కమ్మలు, మాటీలను లాక్కెళ్లిన మహిళలు
- పెనుగులాటలో చెవి తెగడంతో ఆస్పత్రిలో చేరిన వృద్ధురాలు
- ఇటీవల పుంగనూరు, చౌడేపల్లెలో ఇలాంటి ఘటనలే వెలుగు చూసిన వైనం
- కిలాడీ లేడీల కోసం పోలీసుల వెంపర్లాట



చెవి తెగడంతో చికిత్స పొందుతున్న పార్వతమ్మ

పుంగనూరు: పొలంలో పని చేస్తున్న ఓ వృద్ధురాలి మెడలోని గిల్ట్ చైను, చెవిలోని బంగారు కమ్మలు, మాటీలను గుర్తు తెలియని మహిళలు లాక్కెళ్లిన సంఘటన గురువారం మండలంలో వెలుగు చూసింది. పట్టణంలోని తాటిమాకులపాళెంకు చెందిన పార్వతమ్మ కూలీ పనుల నిమిత్తం సింగిరిగుంటలోని పొలంలో పని చేస్తుండగా ఇద్దరు మహిళలు వచ్చి ఆమె మెడలోని చైను, కమ్మలు, మాటీలు లాకెళ్లారు. ఈ ఘటనలో వృద్ధురాలి చెవి తెగిపోయి తీవ్ర రక్తగాయమైంది. 20 గ్రాముల బంగారు నగలను లాక్కెళ్లారు. చైను గిల్ట్‌దని బాధితురాలు తెలిపింది. స్థానికులు గమనించి వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈనెల 1న పట్టణంలోని ఇద్దరు మహిళలకు చెందిన బంగారుచైన్లు, తాళిబొట్లు లాక్కెళ్లారు. అలాగే చౌడేపల్లెలో ఒక మహిళకు చెందిన చైను లాక్కెళ్లారు. పోలీసులు ఇంతవరకు కిలాడీ లేడీ ఆచూకీ కనుగొనలేకపోతున్నారు. ఇలా ఉండగా మహిళలు బంగారు చైన్లు లాక్కెళ్లడం పలువురిని కలవర పరుస్తోంది. వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు స్పందిస్తారా ? లేదా ? వేచి చూడాల్సి ఉంది.

ఫొటో, వీడియోగ్రఫీలపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 20వ తేదీ(బుధవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులు, మహిళలకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలపై పూర్తిగా ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వడంతో పాటు హాస్టల్ సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న పురుషులకు హాస్టల్ వసతి సైతం అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్. 79896 80587, 94949 51289 సంప్రదించాలని సూచించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- 13 జిల్లాల నుంచి అండర్–14 పోటీల్లో తలపడనున్న క్రీడాకారులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ, తవణంపల్లె ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 16వ తేదీ నుంచి 18 వరకు స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్–14 బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ జె.వసంతకుమారి, టోర్నమెంట్ కార్యనిర్వహణాధికారి కె.కృష్ణ, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య, జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్ బాల్ బాలబాలికల టోర్నమెంట్ జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి బాలబాలికలు, కోచ్‌లు మేనేజర్లు సుమారు 550 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. అరగొండ టోటల్ హెల్త్ మైదానంలో, తవణంపల్లె హైస్కూల్లో బాలురకు, అరగొండ బాలుర హైస్కూల్లో బాలికలకు క్రీడా పోటీలను మూడురోజుల పాటు నిర్వహిస్తామన్నారు. 16వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మురళీమోహన్, డీఈఓ వరలక్ష్మితో పాటు పలువురు అధికారులు పాల్గొని ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు జనవరిలో మహారాష్ట్రలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. టోర్నమెంట్ నిర్వహణకు డీఈఓ ఆధ్వర్యంలో 20 మంది పీడీలు, పీఈటీలను నియమించినట్లు తెలిపారు. టెక్నికల్ కమిటీ సెలక్షన్ కమిటీని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పీడీలను రాష్ట్ర పరిశీలకులు జగదీశ్వరయ్య నియమిస్తారని వివరించారు. గురువారం తవణంపల్లె, అరగొండ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, దేవరాజులు రెడ్డి, భువనేశ్వరితో రాష్ట్రస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీల నిర్వహణ ఏర్పాట్లు, క్రీడాకారులు, సిబ్బందికి వసతులు కల్పన గురించి చర్చించారు. క్రీడామైదానం, వసతుల కల్పన ఏర్పాట్లు పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

హామీలు ఇచ్చి బడ్జెట్‌లో ఎగ్గొట్టారు

- ఇది చంద్రబాబు మార్క్ మోసం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా



మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి కూటమి పాలకులు బడ్జెట్‌లో ఎగ్గొట్టారని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. హామీలకు తగ్గట్టుగా రాష్ట్ర బడ్జెట్ కేటాయించకపోవడంపై గురువారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. రాష్ట్ర బడ్జెట్ సాక్షిగా చంద్రబాబు మార్క్ మోసం బయటపడిందన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని, ఆ లెక్కన 2.07 కోట్ల మంది మహిళలకు రూ.37,313 కోట్లు ఇవ్వాల్సి ఉంటే, బడ్జెట్‌లో ఎంత ఇచ్చారని ప్రశ్నించారు. దీపం పథకంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు చొప్పున 1,54,47,061 కనెక్షన్లకు గాను రూ.4115 కోట్లు ఇవ్వాలని, కానీ కేటాయించింది ఎంతన్నారు. తల్లికి వందనంలో ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 చొప్పున రాష్ట్రంలో 83 లక్షల మంది పిల్లలకు గాను రూ.12,450 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా, ఆయన కేటాయించింది ఎంత అని ప్రశ్నించారు. అన్నదాత పథకంలో ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున రాష్ట్రంలో 53.52 లక్షల మందికి గాను రూ.10,706 కోట్లు అవుతుందని, అది బడ్జెట్‌లో ఎక్కడుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఏడాదికి రూ.3 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాల్సి ఉన్నా.. ఇప్పటివరకు అతీగతీ లేదన్నారు. యువగళం పథకంలో రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు రూ.3 వేలు చొప్పున రూ.7,200 కోట్లు ఇవ్వాల్సి ఉంటటే మరి ఇది ఎప్పుడు కేటాయిస్తారన్నారు. రాష్ట్రంలో 50 ఏళ్లు పైబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు దాదాపు 17 లక్షల మంది ఉన్నారని, ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.48 వేలు ఇస్తే బడ్జెట్‌లో రూ.8,160 కోట్లు కేటాయించాలి కదా..! మరి ఆయన కేటాయించింది ఎంత అని ప్రశ్నించారు. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని, వాటికి బెదిరేవారెవరూ లేరని తనతో సహా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రభుత్వాన్ని నిలదీయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

నిషేధ ఉత్తర్వుల జారీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో నిర్వహించకూడని అంశాలను తెలియజేస్తూ జారీచేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ మేరకు జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణాల్లో రాజకీయ, మత, వివాహాలు వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



మాట్లాడుతున్న జేసీ జాన్ స్టీవెన్‌సన్

చిత్తూరు కార్పొరేషన్: వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించాలని వాణిజ్యపన్నుల శాఖ జేసీ జాన్ స్టీవెన్‌సన్ తెలిపారు. గురువారం ఆయన చిత్తూరు, పలమనేరు గ్రానైట్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పన్ను సవరణల గురించి తెలియజేశారు. మొండి బకాయిలను త్వరితగతిన చెల్లించాలని, రాయల్టీ చెల్లింపుపై కొత్తగా సవరణ వచ్చిందని, ఆ ప్రకారం వ్యాపారులు పన్ను కట్టాలన్నారు. రూ.50 వేలు సరుకు రవాణా చేసేటప్పుడు కచ్చితంగా వే–బిల్ పెట్టుకోవాలని, అలాగే ప్రతి కొనుగోలుపై బిల్లులు ఇవ్వాలని సూచించారు. సహాయ కమిషనర్లు వరలక్ష్మి, ఏవీ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో పనిచేస్తున్న 20 మంది జూనియర్ సహాయకులకు సీనియర్ సహాయకులు(ఎస్‌ఏ)గా పదోన్నతి కల్పిస్తూ సీఈఓ రవికుమార్ నాయుడు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రామచంద్ర, షబ్బీర్‌అహ్మద్, సురేష్‌బాబు, యాదగిరిరావ్, సుభాష్ చంద్రబోస్, త్యాగరాజు, తులసీరామ్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, మొహీద్దిన్, యశోద, సుమతి, విద్య, గోపినాథ్, శ్రీనివాసులు, కీర్తి, చంద్రశేఖర్, శ్రీదేవి, గురునాథ, విటల్‌లు పదోన్నతి పొందారు.

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

- పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం
- వేడుకల్లో పాల్గొన్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని సంతపేటలో ఉన్న పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రైనీ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల వెనుక పరిగెత్తకూడదని, అనేక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భావించి పునాదులు వేశారన్నారు. దేశ తొలి ప్రధానిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. చీఫ్ లీగల్ ఆఫీసర్ భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి దృక్పథంతో మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. డీఈఓ వరలక్ష్మి మాట్లాడుతూ బాలలను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైనదని, సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, డ్రామా, పరుగుపందెం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రైనీ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హైమావతి, ఎంఈఓ మోహన్, హెచ్‌ఎం వేదకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీలోని కానుకలను గురువారం లెక్కించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటల వరకు సాగింది. 22 రోజులకు గానూ హుండీ ఆదాయం రూ.1,31,12,759 వచ్చింది. బంగారం 19 గ్రాములు, వెండి 1.420 కిలోలు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.11,360, నిత్యాన్నదానం ట్రస్ట్ హుండీ ద్వారా రూ.28,646లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. విదేశీ కరెన్సీ విషయానికి వస్తే యూఎస్‌ఏ 376 డాలర్లు, యూఏఈ 75 దిర్హామ్స్, మలేషియావి 10 రింగిట్స్, ఇంగ్లాడ్‌వి 75 పౌండ్స్, యూరోవి 60 యూరోలు వచ్చినట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. లెక్కింపులో ఏఈఓలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ్య, సిబ్బంది కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు తరల్ శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎంఈఓ, సీఆర్సీ హెచ్‌ఎంలకు, సీఆర్‌పీలకు ఈ నెల 14వ తేదీ తరల్ (టీచింగ్ అట్ రైట్ లెవల్) శిక్షణా కార్యక్రమం ఇవ్వనున్నట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ శిక్షణకు నిర్దేశించిన సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్, జేసీలు హాజరై సూచనలు ఇస్తారని తెలిపారు.

టీకాల విషయంలో జాగ్రత్త

చిత్తూరు రూరల్(కాణిపాకం): పిల్లలకు అందించే రొటీన్ టీకా విషయంలో వైద్యులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టీకాలు అందించే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే తగు వైద్యం అందేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. సమావేశంలో డీఐఓ హనుమంతరావు, వైద్యాధికారులు శ్రీకాంత్, లత, రంగనాథ్, లోకేష్, అనిల్‌కుమార్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక..

– కత్తితో పొడుచుకున్న యువకుడు



చికిత్స పొందుతున్న నాగరాజు

పుంగనూరు: వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టుకోలేక ఓ యువకుడు తనంతట తానే కత్తితో పొడుచుకున్న సంఘటన పుంగనూరు మండలంలో వెలుగుచూసింది. మండలంలోని కంగానెల్లూరుకు చెందిన నాగరాజు (34) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం కొంతమంది వద్ద అప్పులు చేశాడు. అధిక వడ్డీలు చెల్లించకలేకపోవడంతో వడ్డీ వ్యాపారుల వేధింపులు తీవ్రం కావడంతో నాగరాజు మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో ఉన్న కత్తితో కడుపుపై పొడుచుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



కేసుల్లో పట్టుబడి తుప్పపట్టిన వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ

తవణంపల్లె: పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరితగతిన విచారణ చేసి పూర్తి చేయాలని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ఆదేశించారు. గురువారం తవణంపల్లె పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిసరాల ప్రాంతాల పరిశుభ్రత, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. బ్లాక్ స్పాట్‌ల దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళలు, బాలికల మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమన్లు, నాన్‌బెయిల్ వారెంట్లను పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సివిల్, భూతగాదాలు, పాత గొడవల్లో అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. రాత్రి, పగలు బీట్లను పెంచి నిరంతరం మానిటరింగ్ చేస్తే నేరాలు తగ్గుతాయని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది బాధ్యతగా మెలగాలని వివరించారు. స్టేషన్ సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.